# రైతులు.. బహుపరాక్

- నకిలీ విత్తనాలతో జాగ్రత్త
- ఆఫర్లను చూసి మోసపోవద్దు
- నాణ్యమైనవి ఎంపిక చేసుకుంటేనే మేలు
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన

**జిల్లాలోసాగు ఇలా..**

| | |
|---|---|
| సాగు విస్తీర్ణం | 5,79,546 ఎకరాలు |
| **విత్తనాల అంచనా..** | |
| పత్తి | 10,42,422 ప్యాకెట్లు |
| సోయాబీన్ | 27,529 క్వింటాళ్లు |
| కందులు | 24,498 క్వింటాళ్లు |



**బోథ్:** వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి పాటించాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. ప్యాకెట్లపై ఆకర్షణీయమైన ఫొటోలు, తక్కువ ధరలు ఆఫర్లు చూసి మోసపోవద్దు. నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. విత్తనాల బెడద రైతులకు సవాల్‌గా మారింది. అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించలేని విధంగా విత్తనాలు మార్కెట్‌లోకి వస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. స్థానికంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనాలని చేయాలని వ్యసాయాధికారులు సూచిస్తున్నారు.

**తక్కువ ధరలు, ఆఫర్లు నమ్మొద్దు..**

వర్షాలు పడితే చాలు రైతుల హడావుడి మొదలవుతుంది. రోహిణి కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో విత్తనాల కోసం రైతులు విత్తన డీలర్ల దుకాణాల వద్ద బారులు తీరుతారు. పలు విత్తన కంపెనీలు డీలర్లకు ఆఫర్లు ప్రకటిస్తాయి. ఆ ఆఫర్ల కోసం డీలర్లు రైతులకు విత్తనాలను అంటగడుతున్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండవచ్చు. ఫొటోలు చూపించి, ఆఫర్ల ఆశ చూపి వివిధ పట్టణాలకు కంపెనీ వారు రైతులను తీసుకుపోవడం, గ్రామాల్లో తిరుగుతూ విత్తన ప్యాకెట్లు బుక్ చేసుకోవడం చేస్తుంటారు. వాటికి దూరంగా ఉండడం మంచిదని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- గుర్తింపు పొందిన దుకాణం నుంచి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేస్తేనే అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందే అవకాశం ఉంటుంది.
- విత్తనాలు కొన్న అనంతరం దుకాణం నుంచి తప్పనిసరిగా రశీదు తీసు కోవాలి.
- విత్తనాలు ఏ సంస్థకు చెందినవో ప్యాకెట్‌పై ఉన్న లేబుల్, లాట్ నంబర్ రశీదుపై నమోదు చేసుకొని, భద్రపర్చుకోవాలి,
- తొలుత విత్తనాలు మొలకెత్తే శాతాన్ని ప్యాకెట్‌పై చూసి కొనాలి.

**విత్తనాలపై అవగాహన ఉండాలి**



విత్తనాలపై రైతులు అవగాహన ఉండాలి. కొన్న ప్యాకెట్లలో ఉన్న విత్తనాలు ఎంత శాతం మొలకెత్తుతాయో చూసుకోవాలి. రసీదులు, ప్యాకెట్లను భద్రపర్చుకోవాలి. అనుమతి ఉన్న దుకాణాల్లో విత్తనాలు కొనాలి. విత్తనాలు కొనుగోలు సమయంలో నాసిరకమా? అనేది చూసుకోవాలి.

– వెండి విశ్వామిత్ర, వ్యవసాయాధికారి, బోథ్

## ‘అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం’

**ఎదులాపురం:** తమ నాయకుడిపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాలు అన్నపూర్ణ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్రాల నగేశ్ ఇటీవల ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. ఎదుటివారిని విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. ఎన్రాల నగేశ్ చరిత్ర అందరికీ తెలుసని, కంది శ్రీనివాసరెడ్డిని విమర్శించే స్థాయి, అర్హత అతనికి లేదని మండిపడ్డారు. హిందూ ధర్మం, దేశభక్తిపై గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు ఇటీవల జరిగి పార్లమెంట్ పోలింగ్ సరళిలో ఒక మహిళను పట్టుకుని బొట్టు ఎందుకు పెట్టుకున్నావని ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. మహిళలను గౌరవించే విధానం ఇదేనా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో మహిళా విభాగం బాధ్యులు డి.శ్రీలేఖ, లత, సోనియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నపూర్ణ

## మొక్కలను సంరక్షించాలి

**నేరడిగొండ:** ఎండ తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. సోమవారం మండలంలోని బుద్ధికొండలోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటి తడులు అందించాలన్నారు. గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో, తదితరులు ఉన్నారు.

**ఇచ్చోడ:** నర్సరీలో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇస్లాంనగర్‌లో నర్సరీని పరిశీలించి మాట్లాడారు. ఎండలు అధికంగా ఉన్నందున రోజుకు రెండుసార్లు నీరు పోయాలన్నారు. ప్రతీ మొక్కను కాపాడుకునే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

## విత్తనాల కొరత సృష్టిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ అధికారులు

**బోథ్:** విత్తనాల కొరత సృష్టిస్తే సంబంధిత విత్తన దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర హెచ్చరించారు. రైతులకు కొరత లేకుండా విత్తనాలను సరఫరా చేయాలన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కోరమాండల్ విత్తన దుకాణాన్ని తనిఖీ చేశారు. వివిధ కంపెనీలకు సంబంధించి సరఫరా అయిన స్టాక్‌ను పరిశీలించారు. రైతులకు ఏమైనా సమస్యలుంటే తమను సంప్రదించాలన్నారు. వ్యాపారస్తులు అక్రమాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రశీదు అందజేయాలన్నారు. ఆయన వెంట ఏఈవో శ్యాంసుందర్ రెడ్డి, శ్యాం, జక్క సంతోష్, తదితరులు ఉన్నారు.

**నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి**

**నార్నూర్:** రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రమేశ్, తహసీల్దార్ రాజలింగు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల అతిక్రమిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. రైతులవేదికలలో ప్రతీ మంగళవారం, శుక్రవారం రైతులకు వానాకాలం సాగుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఎరువుల దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పని సరిగా రశీదులు తీసుకోవాలన్నారు. ఏఎస్సై గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయాలి

**తలమడుగు:** మండల కేంద్రంలోని మహిళ సమైక్య (స్త్రీ శక్తి) భవన సమావేశ భవనంలో నుంచి తహసీల్దార్ కార్యాలయం ఖాళీ చేయాలని మండల సమైక్య మహిళా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ.. 2019 సంవత్సరంలో తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉండడంతో తహసీల్దార్ కార్యాలయానికి మండల సమైక్య భవనంలో రెండు గదులను ఇవ్వడం జరిగిందన్నారు. ఆరు సంవత్సరాలు గడిస్తున్నా.. తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టలేదు. నూతన భవన నిర్మించలేదు. మండల సమైక్యలో 28 గ్రామాల సంఘాలు ఉన్నాయి. 690 స్వయం సహాయక సంఘాలు, 7442 సంఘాల సభ్యులు ఉన్నారు. ప్రతినెల సమావేశాలు నిర్వహించడం జరుగుతుంది. ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నామని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యాలయాన్ని ఖాళీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీఎం, స్వామి, మహిళా సంఘాల సభ్యులు ప్రమీల, తాటిపల్లి సుశీల, రజియా, సజిత, పెందురు సోంబాయి, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

## ధాన్యం కొనుగోళ్లు పరిశీలన

**సారంగపూర్:** మండలంలోని జామ్, యాకర్‌పెల్లి గ్రామాల్లో కొట్ల(బి) పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని నిర్వాహకులు సలీమ్, రవిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం త్వరగా మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటివరకు తరలించిన ధాన్యం వివరాలను గురించి ఆరా తీశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేసి వారికి తూకం పట్టి అందజేయాలని సూచించారు. అలా చేస్తేనే రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ అవుతాయని తెలిపారు.

## సైనికుడి కుటుంబానికి చెక్కు అందజేత

**కైలాస్‌నగర్:** ఆర్మీలో విధులు నిర్వర్తిస్తూ.. మృతి చెందిన సొలంకి సుధాకర్‌కు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా మంజూరైన రూ.3లక్షల ఆర్థికసాయం చెక్కును సోమవారం ఆయన భార్య సోలంకి పూజకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా అందజేశారు. నేరడిగొండ మండలం కిష్టాపూర్‌కు చెందిన సోలంకి సుధాకర్ ఆర్మీలో పనిచేస్తూ సర్వీసులో ఉండగానే గతేడాది ఆగస్టు 6న మృతి చెందారు. ఆయనకు సెంట్రల్, స్టేట్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని తన కార్యాలయ ఛాంబర్‌లో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు శంకర్ దాస్, దేవన్న, అశోక్, తిరుపతి రెడ్డి, వామన్ రెడ్డి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## ఘనంగా శివలింగాభిషేకం

**ఆదిలాబాద్:** లోక కల్యాణార్థం జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్ కాలనీలో గల సంకట మోచన హనుమాన్ మందిరంలో శివలింగాభిషేకం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో శివలింగాభిషేకం నిర్వహించడం జరిగిందని హనుమస్ దీక్షదారులు తెలిపారు. కార్యక్రమంలో స్వాములు సురేందర్, చంద్రశేఖర్, మహేశ్, అడెళ్ళు, సతీష్, సౌరబ్, వికాస్, నవీన్, పవన్ పాల్గొన్నారు.



శివలింగాభిషేకం చేస్తున్న భక్తులు

## గుట్టనా? క్రీడా ప్రాంగణమా?



**బోథ్:** ప్రతీ గ్రామంలో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కొన్ని గ్రామాల్లో స్థలం లేకపోవడంతో పలు పాఠశాలల ఆవరణలోనే ఏర్పాటు చేశారు. అయితే మండలంలోని బాబెర గ్రామంలో గుట్ట వద్ద బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఇదేం క్రీడా మైదానం అని అటు వైపు వెళ్లిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

# నష్టాల్లో వేరుశనగ రైతులు

- పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి
- కొనుగోలు కేంద్రాలు లేక దళారులకు విక్రయం



వేరుశనగ పంట తీస్తున్న కూలీలు

**తాంసి:** వేరుశనగ సాగు చేసిన రైతులు ఆశించిన లాభాలు రాక నష్టపోవాల్సి వస్తోంది. పంట సాగు చేశామన్న తృప్తి తప్పితే పెట్టుబడులు కూడా దక్కడం లేని ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది లద్దె పురుగు ఉధృతి కారణంగా దిగుబడి సరిగా రాలేదు. అయినా.. ఉన్న పంటను విక్రయిద్దామంటే మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో ప్రభుత్వం వేరుశనగ పంటకు కేటాయించిన మద్దతు ధర సైతం దక్కడం లేదని వాపోతున్నారు. గిట్టుబాటు కాకున్నా.. దళారులకు విక్రయించాల్సి వస్తోంది.

**దక్కని మద్దతు ధర..**

జిల్లాలో వేరుశనగ గత రెండేళ్లుగా రైతులు సాగు చేస్తున్నారు. వేరుశనగ సాగు బాగానే ఉన్నా.. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఈఏడాది జిల్లాలో యాసంగి సీజన్‌లో దాదాపుగా 6 నుంచి 8వేల ఎకరాల్లో వేరుశనగ సాగుచేసినట్లు తెలుస్తోంది. కాగా అధికంగా తలమడుగు తాంసి, భీంపూర్ మండలాల్లో అధికంగా రైతులు సాగు చేశారు. గత జనవరిలో సాగుచేసిన పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తోంది. ప్రభుత్వం వేరుశనగను క్వింటాలుకు రూ.6377 ప్రకటించిన కొనుగోలు కేంద్రాలు లేక మద్దతు ధర దక్కడం లేదు. పంట చేతికి రాకముందు బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.7వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం క్వింటాలుకు రూ.5500 నుంచి 6 వేల లోపు కొనుగోలు చేస్తున్నారు.

**తగ్గిన దిగుబడి..**

ఈ యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ సరైన దిగుబడి రాలేదు. ఫిబ్రవరి, మార్చిలో ఆకాశం మేఘావృత్తమై ఉండడంతో పురుగు ఉధృతి పెరిగింది. దీంతో దిగుబడిపై ప్రభావం చూపింది. గతేడాది ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈఏడాది దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. పంట తీసే సమయంలో అకాల వర్షాల వలన పంట దెబ్బతినడంతో రైతును మరింత కుంగదీసింది. కనీసం మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మార్కెట్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

**మూడెకరాల్లో సాగు చేశా**



ఈ యాసంగి సీజన్‌లో గ్రామ శివారులో మూడు ఎకరాల వేరుశనగ సాగు చేశాను. పంట కోసం కౌలుతో పాటు మొత్తం పెట్టుబడి రూ.1లక్ష వరకు ఖర్చు చేశాను. లద్దెపురుగు ఉధృతి పెరిగి దిగుబడి తగ్గింది. ఎకరానికి 9 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది.

– జి.అశోక్, రైతు, వడ్డాడి

**మద్దతు ధరతో కొనాలి**



వేరుశనగ రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. జిల్లాలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు ఇష్టారీతిన ధర తగ్గించి పంటను కొంటున్నారు. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది.

– ప్రవీణ్ రెడ్డి, రైతు, తాంసి

## ప్రభుత్వ కళాశాలలో చేరండి

**బోథ్:** పదో తరగతి పాసైన విద్యార్థులు బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు పొచ్చెర, మర్లపెల్లి, కనుగుట్ట గ్రామాల్లో అధ్యాపకులు, లక్ష్మణ్, నగేశ్‌లు ప్రచారం చేశారు. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

## క్లుప్తంగా

### స్పాట్ కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలి

**ఇచ్చోడ:** గిరిజన విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇచ్చోడ గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి కోరారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన గురుకులాల్లో చదువుకునేందుకు విద్యార్థులు ఈనెల 23న ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులో బాలికలు స్పాట్ అడ్మిషన్ ద్వారా సీట్లు పొందవచ్చన్నారు.

### నేడు జొన్న కొనుగోళ్లు నిలిపివేత

**తాంసి:** మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో నేడు జొన్నల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు సొసైటీ సీఈవో కేశవ్ తెలిపారు. యార్డులో గన్నీ బ్యాగుల కొరత కారణంగా కొనుగోళ్లను ఒక రోజు పాటు నిలిపివేయడం జరుగుతుందన్నారు. రైతులు గమనించి మార్కెట్ యార్డుకు జొన్నలను తీసుకురావద్దన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆదిలాబాద్‌రూరల్:** ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదిలాబాద్‌లోని ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పరిధిలో గల బెల్లూరి, చాందా(టి) పరిశ్రమలు, షాపులకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ మండల ఏఈ తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ బాల్స్ అందజేస్తున్న ఆడే నూర్‌సింగ్

**నేరడిగొండ:** యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ముత్యాలీబాయి హమ్ము నాయక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్‌సింగ్ నాయక్ అన్నారు. నేరడిగొండ ప్రీమియర్ లీగ్‌లో యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.5 వేల విలువ గల బాల్స్ సోమవారం అందజేశారు. క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జె.పవన్ కుమార్, జట్ల కెప్టెన్‌లు లఖన్, యోగి, మణిరాజ్, హరీష్, అనిల్ పాల్గొన్నారు.

### ఆయుధాల పరిశీలన



పరిశీలిస్తున్న స్పెషల్ టీం ఏఆర్ ఎస్సై భీంరావ్ నాయక్

**బోథ్:** బోథ్ పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాలను స్పెషల్ టీం ఏఆర్ ఎస్సై భీంరావ్ నాయక్ సోమవారం పరిశీలించారు. ప్రతినెల సాధారణ పరిశీలన చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయుధాలకు మరమ్మతులు అవసరమైతే చేయిస్తామన్నారు. బోథ్, నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ మండలాల్లో సైతం ఆయధాలను పరిశీలించినట్లు తెలిపారు.

### అంతిమ సంస్కారాలకు చేయూత

**గుడిహత్నూర్:** మండలంలోని నిరుపేద మహిళ బెంబేరి స్వరూప (38) అనారోగ్యంతో మృతి చెందడంతో అంతిమ సంస్కారాలకు గ్రామానికి చెందిన రత్న సాన్వి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పారపు సత్యరాజ్ అంత్యక్రియల కోసం రూ.5 వేలు అందించి ఉదారత చాటుకున్నాడు. ఆమె కొడుకు కూలీ చేసుకుంటూ ఆసరాగా ఉంటున్న సమయంలో అనారోగ్యంతో మృతి చెందడంతో సత్యరాజ్ దృష్టికి తీసుకు వెళ్లడంతో సాయం అందించారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**ఖానాపూర్:** మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మహేశ్ ఇటీవల రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. దీంతో కాలికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ సోమవారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అనంతరం అడవిసారంగపూర్‌కు చెందిన మాజీ ఉప సర్పంచ్ మారుతి తండ్రి సోనేరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచి సుర్జాపూర్‌కు వెళ్లి మృతి చెందిన భూసి నడిపిన ర్సయ్య కుటుంబాన్ని ఓదార్చారు.